క్లుప్తంగా

తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలి



సూచనలు చేస్తున్న డీఎల్‌పీవో

జూలపల్లి: వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటి కొరత రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని డీఎల్‌పీవో వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీని ఆకస్మిక తనిఖీ చేసిన అనంతరం గ్రామంలో గతంలో తాగునీరు సరఫరా చేసిన బావులను, నర్సరీ, పారిశుద్ధ్య పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్యదర్శి లచ్చయ్యను ఆదేశించారు. డీపీవో కిరణ్, కంప్యూటర్ ఆపరేటర్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

పెద్దపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుతూనే వార్డు పరిశుభ్రతకు సహకరించాలని 8వ వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని నారాయణస్వామినగర్, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన స్వచ్ఛ శుక్రవార్ కార్యక్రమం పనులను పరిశీలించారు. వార్డులో పిచ్చిమొక్కల తొలగింపు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా తమవంతుగా డ్రైనేజీల్లో చెత్త, చెదారం పడేయకుండా ఇంటికి వచే పారిశుద్ధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలన్నారు. సిబ్బంది కరుణాకర్, భూమయ్య, లక్ష్మి ఉన్నారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లోని 12వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌ను డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ కోరారు. శుక్రవారం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించి సమస్యలు వివరించారు. స్పందించిన కమిషనర్ చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పాలకుర్తి: మండల పరిధిలోని ఘన్‌శ్యాం దాస్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధిహామీ పని ప్రదేశాలను శుక్రవారం ఎంపీడీవో శశికళ సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడుతూ వేజ్ సేకర్స్ స్వీప్ ఆక్టివిటీస్ కార్యక్రమంలో భాగంగా ఓటు వేయడం అందరి బాధ్యత, ఓటు హక్కును అందరు వినియోగించుకోవాలని ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలో ఉదయం 6–10 గంటల వరకు పనులు పూర్తి చేసుకొని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో కొమురయ్య, కార్యదర్శి రవి ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం



యంత్రాల తాంబూలంతో ఎంపీపీ కరుణశ్రీ దంపతులు

ధర్మారం: మండలంలోని పైడిచింతలపల్లిలో శుక్రవారం పోచమ్మ శిలా విగ్రహ, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి యంత్రాల తాంబూలంను సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాం, ఎంపీపీ కరుణశ్రీ గ్రామ చౌరస్తాలో ప్రతిష్ఠించే బొడ్రాయి వద్దకు భక్తుల సమక్షంలో తరలించారు. ఆలయ కమిటీ చైర్మన్ కల్లెం జల్పతిరెడ్డి, మాజీ సర్పంచు తిరుపతి, రేవెల్లి తిరుపతి, పాక వెంకటేశం పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణ మాత్రల పంపిణీ

కమాన్‌పూర్: సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధిహామీ కూలీలకు వడదెబ్బ నివారణ హోమియో మాత్రలను పంపిణీ చేశారు. గోదావరిఖనికి చెందిన హోమియో వైద్యులు రమేశ్‌బాబు సౌజన్యంతో మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, నల్లవెల్లి శంకర్, గసిగంటి అజయ్ ఉన్నారు.

వాహనాల తనిఖీ

జూలపల్లి, ఎలిగేడు: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని రామగుండం సీపీ ఆదేశాల మేరకు జిల్లా డీసీపీ, ఏసీపీ, సుల్తానాబాద్ సీఐ పర్యవేక్షణలో రెండు మండలాల్లో ఎస్సై శ్రీధర్ తన సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల్లో అక్రమంగా మద్యం, డబ్బు, రవాణా జరగకుండా చర్యలు తీసుకునేందుకు తనిఖీలను ముమ్మరం చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పడిపోయేలా ఉన్నాయి.. పట్టించుకోండి

- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
- చర్యలు తీసుకోవాలని పెద్దబొంకూర్ గ్రామస్తుల విజ్ఞప్తి
- లూజు తీగలను సరిచేయాలని దస్తగిరిపల్లెవాసుల డిమాండ్





ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉందిద. రాజీవ్ రహదారి నుంచి పెద్దబొంకూర్ వెళ్లే మార్గంతో పాటు గ్రామంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి ఓ పక్కకు ఒరిగాయి. ఇటీవల భారీగా ఈదురుగాలులు వీస్తుండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆయా ప్రాంతాల సమీపంలో ఉన్న ఇళ్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాలు ఒరిగి కిందపడేందుకు సిద్ధంగా ఉన్న ఒకటి, రెండు పోల్స్‌కు సపోర్ట్ స్తంభాలు అమర్చి విద్యుత్ అధికారులు చేతులు దులుపుకున్నారనే విమర్శలున్నాయి. రోడ్డు విస్తరణ పనులు సాగుతున్న సమయంలోనైనా విద్యుత్ స్తంభాలను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మరోవైపు లూజు తీగలు..

లూజుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాల్సిన అధికారులు ఈ పని 'మాది కాదంటే..మాది కాదు' అంటూ తప్పించుకుంటున్నారని పెద్దపల్లి మండలంలోని దస్తగిరిపల్లి వాసులు రెండురోజుల క్రితం నిరసనకు దిగారు. వాటిని సరిచేయాలని పలుమార్లు సంబంధిత విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. దస్తగిరిపల్లి గ్రామ స్టేజీవద్ద లూజు విద్యుత్‌తీగలకు ఆసరాగా ఓ కర్రను అమర్చుకోవాల్సి వచ్చిందని, ప్రమాదం జరిగితే బాధ్యులెవరని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అయితే గ్రామస్తుల ఒత్తిడితో విద్యుత్ అధికారులు తాత్కాలికంగా రెండు స్తంభాలు అమర్చి తీగలను సవరించారు.

సమస్యకు పరిష్కారం చూపాలి



పెద్దబొంకూర్‌లో విద్యుత్ పరమైన సమస్యలకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు విన్నవించాం. విద్యుత్ స్తంభాలు విరిగి ఏ క్షణమైనా కింద పడే ప్రమాదముంది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని విద్యుత్ స్తంభాలను సరిచేసి సమస్యకు పరిష్కారం చూపాలి.

– మిట్టపల్లి శ్రీనివాస్, పెద్దబొంకూర్

ఒకవైపు ఒరిగి ఉన్నాయి



మా ఊళ్లో ఇళ్ల మధ్యలో ఉన్న కరంటు స్తంభాలు ఒక వైపు ఒరిగి ఉన్నాయి. భారీ ఈదురుగాలులు వీస్తుండడంతో అవి ఎక్కడ మా ఇళ్లపై పడతాయోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి సమస్యకు పరిష్కారం చూపాలి.

– కలవేన స్వరూప, పెద్దబొంకూర్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలి



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కోరారు. శుక్రవారం ఎలిగేడు మండలంలోని నారాయణపల్లి, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనుల వద్ద ప్రచారం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతి గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మాజీ సర్పంచ్‌లు అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు, కొండ తిరుపతిగౌడ్, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ నరహరి సుధాకర్‌రెడ్డి, నాయకులు భూర్ల వెంకటసత్యం, మనోహర్‌రావు, తాటిపల్లి రమేశ్‌బాబు, అమ్ముల రమేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే ఉపాధి కూలి పెంపు

సుల్తానాబాద్‌రూరల్: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉపాధిహామీ కూలీలకు రోజుకు రూ.400 ఇస్తామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి, భూపతిపూర్ గ్రామాల్లో శుక్రవారం ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి పెద్దపల్లి ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణని గెలిపించాలని కోరారు. నాయకులు ప్రకాశ్, సతీశ్, మహేందర్, వెంకన్న, రాములు, తిరుపతి, వెంకటేశ్వర్‌రావు, బక్కయ్య ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఇప్పలపల్లెలో అభయాంజనేయ స్వామి ఆలయంలో శివపంచాయతనం, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చక పూజారులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందించారు. ఆప్కాబ్ మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఎంపీటీసీ రావి సదానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య పాల్గొన్నారు.

ఎంపీగా కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలి



ప్రజలతో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. శుక్రవారం నగరంలోని 40, 41వ డివిజన్‌లలో ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.

సమ్మర్ కోచింగ్ క్యాంప్ సద్వినియోగం చేసుకోండి

గోదావరిఖని: ఈనెల 29 నుంచి ప్రారంభించే వేసవి ఉచిత క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో చిన్నారుల కోసం శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఏటా 2024–25లో 18ఏళ్లలోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. 29వ తేదీ నుంచి 25రోజుల పాటు స్థానిక యైటింక్లయిన్‌కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియంలో వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తి గల వారు ఆర్జీ–2 జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడిద్దాం

పెద్దపల్లిరూరల్: కేంద్రంలో అధికారంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు అండగా నిలిచిందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ కోరారు. పెద్దపల్లిలో శుక్రవారం పార్లమెంట్ ఎన్నికలు–కార్మికవర్గ కర్తవ్యం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులనే గెలిపించాలన్నారు. నాయకులు ముత్యంరావు, జ్యోతి, వెంకటస్వామి, ఖాజా ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు ముత్తారంలో మంత్రి పర్యటన

ముత్తారం: మండలంలో శనివారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటించనున్నట్లు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సందానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు. మండలంలోని మచ్చుపేట నుంచి బైక్ ర్యాలీ తీస్తారని తెలిపారు.

జీఎల్‌బీకేఎస్ నుంచి కె.విశ్వనాథ్ బహిష్కరణ

గోదావరిఖని: జీఎల్‌బీకేఎస్ నుంచి కె.విశ్వనాథ్‌ను బహిష్కరించినట్లు గోదావరిలోయ బొగ్గగని కార్మిక సంఘం(జీఎల్‌బీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం గోదావరిఖనిలో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న విశ్వనాథ్ సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున యూనియన్ నుంచి బహిష్కరిస్తూ తీర్మానం చేసినట్లు వివరించారు. నిబంధనావళి, క్రమశిక్షణకు వ్యతిరేకంగా ఆర్థిక ప్రయోజనాల కోసం ఆరాటపడుతూ కార్మికుల ప్రయోజనాలు వదిలి పైరవీలకు పాల్పడుతున్నాడన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.సీతారామయ్య, నాయకులు మేకల రామన్న, ఈదునూరి రామకృష్ణ, విశ్వనాథం, మల్లేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహుని జాతర హుండీ లెక్కింపు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన దుకాణాల వేలం, కల్యాణం, హోమం, షకటోత్సవం, రథోత్సవం, జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలు, హుండీలను ఆలయ ఈవో సదయ్య సమక్షంలో శుక్రవారం లెక్కించారు. గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన లెక్కింపులో రూ.8.67లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుజాత, ఎంపీటీసీ జి.రజనీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని నిరుపేద కుటుంబాలకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. గ్రామానికి చెందిన కంది నాగమణి–సారయ్య దంపతుల కుమార్తె కంది హర్షిత వివాహం, ఇరుగురాల రాజేశ్వరి శంకర్ కుమార్తె లక్ష్మి వివాహం శుక్రవారం జరిగింది. నిరుపేద ఆడబిడ్డలకు సాయం అందించాలని మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి లయన్స్ క్లబ్ సభ్యులను సంప్రదించారు. లయన్స్ క్లబ్ సభ్యులందరితో కలిసి ఇద్దరికి వేరువేరుగా రూ.5500, పట్టుచీర అందజేశారు.

చెలరేగిన మంటలు

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు చందపల్లి వద్ద గల బీఎస్‌ఎన్‌ఎల్ ఎక్స్ఛేంజ్ వద్ద శుక్రవారం మంటలు చెలరేగాయి. ఆకతాయిలు సిగరెట్ పడేసిన కారణంగా మంటలు అంటుకుని ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు. కౌన్సిలర్ రాజం మహంత సమాచారం అందించగా ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చినట్లు ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు.

పారిశ్రామికవేత్త ఓంప్రకాశ్ జకోటియా మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి, పారిశ్రామికవేత్త ఓంప్రకాశ్ జకోటియా శుక్రవారం ఆకస్మిక కన్నుమూశారు. పట్టణంలో పెట్రోల్‌పంపుతోపాటు గన్నీ సంచుల తయారీ పరిశ్రమలను స్థాపించారు. వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారు. ఓంప్రకాశ్ జకోటియా మరణంపై ఎమ్మెల్యే విజయరమణారావు, పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య, మాజీ ఎంపీపీ జయలక్ష్మి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్ కిశోర్ శారదతో పాటు పలువురు నాయకులు, వ్యాపారులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. రిక్రియేషన్‌క్లబ్‌లో ప్రధానకార్యదర్శి కొట్టె సదానందం సంతాప సభ నిర్వహించారు.

గుడిసె దగ్ధం

కమాన్‌పూర్: స్థానిక బాపూజీనగర్‌లోని కామెర లక్ష్మయ్యకు చెందిన గుడిసె శుక్రవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. గుడిసెలోని రూ.20వేల నగదు కాలిపోయింది. పెద్దపల్లి నుంచి ఫైరింజిన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చా యి. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ ఆరిఫొద్దీన్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ఇండియా కూటమికి మద్దతివ్వండి

రామగుండం: పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని సీఐటీయూ పెద్దపల్లి జిల్లా ప్రతినిధులు కోరారు. శుక్రవారం పట్టణంలోని జీరోపాయింట్ ఏరియా కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. సీఐటీయూ ప్రతినిధులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామగుండం: అంతర్గాం మండల పరిధి పలు గ్రామాల శివారులో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అంతర్గాం ఎన్పీడీసీఎల్ ఏఈ ఆశ శంకర్ తెలిపారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

జ్యోతినగర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గోమాసె శ్రీనివాస్‌ను గెలిపించాలని పార్టీ శ్రేణులు ఇంటింటా ప్రచారం చేశారు. శుక్రవారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలోని 43వ బూత్ అధ్యక్షుడు బాగాల స్వామి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. దేశంలోని పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో మోదీ అగ్రభాగాన నిలిచారన్నారు. అభయాంజనేయ స్వామి శక్తి కేంద్ర ఇన్‌చార్జి రామస్వరూప, బీజేపీ నాయకులు సప్ప నాగరాజు, శ్రీనివాస్, మధు, సిద్దు, ప్రవీణ్, రాహుల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా తిరుపతి

యైటింక్లయిన్‌కాలనీ: తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా కాలనీకి చెందిన సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ యాదగిరి తిరుపతిని నియమించినట్లు మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



బావిని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పెద్దపల్లి మండలంలోని మారెడుగొండ, గుర్రాంపల్లి, హన్మంతునిపేట తదితర గ్రామాల్లో శుక్రవారం మండల పరిషత్ అధికారి సుదర్శన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సతీశ్, ఏఈ మధు తాగునీటి వనరులను పరిశీలించి అత్యవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎలా చేయాలనే అంశాలపై పరిశీలించారు. తాగునీటి సరఫరా కోసం నిధులున్నాయని, ఎలాంటి ఇబ్బదులు రాకుండా అన్ని చర్యలు చేపడతామని ఎంపీవో సుదర్శన పేర్కొన్నారు.

ఓసీపీ–3 క్యాంటీన్‌లో భోజనాలు ప్రారంభం



క్యాంటీన్‌లో భోజనం అందజేత

గోదావరిఖని: సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాం ఓసీపీ–3 పర్యటన సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం నుంచి క్యాంటీన్‌లో భోజనాలు అందిస్తున్నారు. వేసవినిదృష్టిలో ఉంచుకుని కార్మికుల సౌకర్యార్థం క్యాంటీన్ ద్వారా భోజనాలు అందించాలని క్యాంటీన్‌లో అల్పాహారం చేయడానికి రెండురోజుల క్రితం వచ్చిన సీఎండీకి ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులతో పాటు కార్మికులు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన సీఎండీ కార్మికులకు భోజనాలు అందించే పక్రియ వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం నుంచి భోజనాలు ప్రారంభించారు. శుక్రవారం పులిహోరతో ప్రారంభించగా, సోమవారం నుంచి పూర్తిస్థాయి భోజన సౌకర్యం అందుబాటులోకి వస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ విధానం ఇప్పటికే ఓసీపీ–1లో కొనసాగుతోంది. ఓసీపీ–3 క్యాంటీన్‌లో నో లాస్, నో బెనిఫిట్ పద్ధతిన అమలు చేయడంపై కార్మికులు సీఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. కాగా తమ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో మాట్లాడటంతో భోజనాల పక్రియ అమలులోకి వచ్చిందని ఐఎన్‌టీయూసీ నాయకులు కొత్త సత్యనారాయణరెడ్డి, ఎట్టం కృష్ణ తెలిపారు.

అసంఘటిత రంగ కార్మికుల వేతనాలు సవరించాలి



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

జ్యోతినగర్: రాష్ట్రంలోని అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాలను సవరించాలని, జీవో నెంబర్ 22 విడుదల చేయాలని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు వినతిపత్రం అందించారు. యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ మాట్లాడారు. కార్మిక కుటుంబాలు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే కనీస వేతన జీవోలపై ప్రభుత్వం ఇచ్చిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ రద్దుచేసి గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్–22ను గెజిట్ చేయాలని కోరారు. రూ.26వేలు కనీస వేతనంగా చెల్లించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, జీవో విడుదలకు కృషి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.

'కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు'

ఓదెల: కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఓదెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం తప్పదన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. మానేరు ఇసుక రవాణా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే టెండర్లు జరిగాయన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యేకు ఇసుక రవాణాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, యూత్ కాంగ్రెస్ పెద్దపల్లి కార్యదర్శి చిలుక హరికాంత్, జీలకుంట ఎంపీటీసీ రాగిడి రవీందర్‌రెడ్డి, నాయకులు అల్లం సతీశ్, శంకర్, నిరంజన్‌రెడ్డి, బ్రహ్మచారి, సదయ్య పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధంగా ఉండాలి

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేలా పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. లింగయ్య, రాజేశ్వరి, కొమురమ్మ, రాయమల్లు, రజిత, ప్రకాశ్, స్వామి, నాగరాజు పాల్గొన్నారు.

పుట్ట మధు అసత్య ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న తోట చంద్రయ్య

రామగిరి: రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై, కాంగ్రెస్ పార్టీపై జెడ్పీ చైర్మన్ పుట్ట మధు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య అన్నారు. శుక్రవారం సెంటనరీకాలనీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్ట మధు ఆరోపణల మీద కాంగ్రెస్ పక్షాన బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఎంపీటీసీ చిందం మహేశ్, మండల ప్రచార కమిటీ చైర్మన్ ముస్త్యాల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ డివిజన్ ఉపాధ్యక్షుడు మోత్కూరి అవినాష్‌గౌడ్, నాయకులు బుద్దార్థి శ్రీనివాస్, మారుకొండ సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆర్థిక చేయూత

సాక్షి ఎఫెక్ట్..



నగదు అందజేస్తున్న విద్యార్థులు

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన కన్నాల రమేశ్ పాంక్రియాటిస్ వ్యాధితో బాధపడుతున్నాడని తెలుసుకున్న పలువురు దాతలు ఆదుకోవడానికి ముందుకు వస్తున్నారు. రమేశ్ పరిస్థితిపై 'ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి' అనే శీర్షికతో ఏప్రిల్ 14న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో కల్వచర్ల కృష్ణవేణి పాఠశాలలో చదువుతున్న రమేశ్ కుమార్తె సహస్ర, కుమారుడు రియాన్ష్ వారి క్లాస్‌మేట్స్ రూ.15వేలు రమేశ్ సోదరుడు సంపత్‌కు అందజేశారు. చిన్నారులను కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బర్ల శ్రీనివాస్, డైరెక్టర్స్ శ్రీధర్‌బాబు, అనిల్ కుమార్‌రెడ్డి అభినందించారు.

ఓటుహక్కుపై అవగాహన

జూలపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని నాయబ్ తహసీల్దార్ అబూబాకర్ సూచించారు. మండల కేంద్రంలో ఓటుహక్కు వినియోగంపై గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్థానిక మందోట వద్ద ఓటుహక్కు వినియోగించుకుంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు సదయ్య, ప్రవంతి, సందీప్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, శేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజనర్సమ్మ, పద్మ పాల్గొన్నారు.

కళాకారుల ప్రదర్శన

ముత్తారం: మండలంలోని మచ్చుపేటలో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఓటుహక్కు వినియోగం, ప్రాముఖ్యతపై కళాకారులు తమ ప్రదర్శనలతో స్థానికులకు అవగాహన కల్పించారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై కళాకారులు వివరించారు. కళాకారులు జనగామ రాజనర్సు, ఇదునూరి పద్మ, బుర్ర శంకర్‌గౌడ్, కొండ్ర వెంకన్నగౌడ్, సత్యేంద్ర రాజన్న, చిన్న రమ, దీకొండ శ్రావణ్, కన్నూరి రేణుక పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

జ్యోతినగర్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక విభజన విధానాలను తిప్పికొట్టాలని కోరారు. అనంతరం మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం బ్రాంచ్ కార్యదర్శి బి.బుచ్చన్న, సంఘం నాయకులు ఆర్.రాయమల్లు, సుధాకర్, కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముద్దిర్యాల, పొట్యాల, విసంపేట, ఎగ్లాస్‌పూర్, ఆకెనపల్లి, ముర్మూర్ తదితర గ్రామాల్లో గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపులు, తాగునీటి పైపులైన్లను పరిశీలించారు. ఎంపీడీవో ఎంఏ.అలీం తదితరులు ఉన్నారు.